# పోలీస్ ఉద్యోగాలు ఎప్పుడిస్తరు?

## ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నిరుద్యోగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తక్షణం నోటిఫికేషన్లు ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో జీవో-46తో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా పోలీస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు వాపోయారు. 2016, 2018, 2022లో అప్పటి ప్రభుత్వం ప్రతి నోటిఫికేషన్‌లో 15 వేల పోలీస్ ఉద్యోగాలు ఇచ్చిందని, ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఒక్క పోలీస్ నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆరోపించారు. నోటిఫికేషన్లు లేక, ఉద్యోగాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో కాలయాపన చేయకుండా పోలీసు ఉద్యోగార్థులకు త్వరగా నోటిఫికేషన్ ఇవ్వాలని, ముఖ్యంగా ఆంధ్రా పోలీస్ అధికారి వీవీ శ్రీనివాస్‌రావును పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా తప్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని పోలీస్ నిరుద్యోగ బాధితులు ఆకాశ్, శంకర్, కల్యాణ్, వంశీ, నవీన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# డౌన్‌మెరిట్ అమలు చేయాలి

*గురుకుల నియామకాల్లో డౌన్‌మెరిట్‌ను తక్షణమే అమలు చేయాలని గురుకుల 1:2 అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాభవన్ వద్ద మెట్లపై కూర్చొని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా గురుకుల డీఎల్, జేఎల్, పీజీటీలకు కామన్ పేపర్లతో పరీక్షలు నిర్వహించారని వాపోయారు. ఎంపీ ఎన్నికల హడావుడిలో జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ ప్రకటించకుండా, అవరోహణ క్రమం పాటించకపోవడం వల్ల వేలాది మందికి అన్యాయం చేశారని మండిపడ్డారు. కోర్టు తమకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినా.. ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నియామకాల్లో తాత్సారం చేస్తూ ప్రభుత్వం, గురుకుల బోర్డు తమను మోసం చేస్తున్నదని మండిపడ్డారు.*

# పదోన్నతులిచ్చారు.. పోస్టింగ్స్ మరిచారు

- టీజీ జెన్‌కోలో విచిత్రపరిస్థితి
- అక్టోబర్ నుంచి ఎదురుచూపులు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : టీజీ జెన్‌కోలోని కొందరు అసిస్టెంట్ ఇంజినీర్లకు(ఏఈ) పదోన్నతులు కల్పించిన అధికారులు, పోస్టింగ్స్ ఇవ్వడం మాత్రం మరిచారు. దీంతో నాలుగు నెలలుగా వారికి నిరీక్షణ తప్పడంలేదు. 203 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు(ఏఈ), అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు(ఏడీఈ)గా 2024 అక్టోబర్ 9న పదోన్నతి కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు కల్పించారని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది జనవరి 31న తుది తీర్పు వచ్చింది. 20రోజులు గడుస్తున్నా ఇంత వరకు పోస్టింగ్స్ ఊసెత్తడంలేదు. పోస్టింగ్స్ కల్పించే విషయంలో జెన్‌కో సీఎండీ సహా, డైరెక్టర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. వారి నిర్లక్ష్యంతోనే పోస్టింగ్స్ నిలిచిపోయాయి.

**వైటీపీఎస్‌లో ఇంజినీర్ల కొరత..**

ప్రతిష్టాత్మక యాదాద్రి పవర్ ప్లాంట్‌లో(వైటీపీఎస్) ఇంజినీర్ల కొరత సమస్య వేధిస్తున్నది. అయినా అధికారులకు పట్టకపోవడం గమనార్హం. తాజాగా పదోన్నతులు పొందిన 203 మందిలో 100 మంది ఏడీఈలను యాదాద్రి పవర్‌ప్లాంట్‌కే కేటాయించాల్సి ఉంది. ఒక వైపు సమస్యలు వెన్నాడుతున్నా ఈ ప్లాంట్‌కు ఏడీఈలను కేటాయించడంలేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కల్పించుకుని తమకు పోస్టింగ్స్ ఇప్పించాలని పోస్టింగ్స్ పొందిన ఏడీఈలు విజ్ఞప్తిచేస్తున్నారు.

## బడి పిల్లలకు 'కేసీఆర్' స్వీటు..

# ఉపాధ్యాయురాలిపై వేటు

- కేసీఆర్ బర్త్‌డే రోజు స్కూల్‌లో మొక్కలు నాటి, చాక్లెట్లు పంచిన బీఆర్ఎస్ నాయకులు
- పాఠశాలలో కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలకు ఎలా అనుమతిచ్చారని టీచర్‌పై సర్కార్ వేటు
- ఉపాధ్యాయురాలు రజితను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 18 : కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా హస్తినాపురం డివిజన్ నందనవనం సర్కారు పాఠశాల ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు మూడు మొక్కలు నాటగా ఎందుకు అనుమతి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయురాలిపై ప్రభుత్వం వేటు వేసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నందనవనంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక లక్కీ హోటల్ వద్ద కేక్ కట్ చేయడంతోపాటు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడు మొక్కలు నాటి, విద్యార్థులకు చాక్లెట్లు పంచారు. ఇదే నేరంగా భావించిన విద్యాశాఖ అధికారులు ఇన్‌చార్జి హెడ్ మాస్టర్‌గా ఉన్న రజితను మంగళవారం సస్పెండ్ చేశారు. కేసీఆర్ జన్మదిన వేడుకలకు ఎలా అనుమతిచ్చారని, అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ డీఈవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇదే పాఠశాలలో ఎన్నోసార్లు జాతీయ, రాష్ట్ర నాయకుల జన్మదినం సందర్భంగా చాక్లెట్లు పంచిన సందర్భాలు ఉన్నాయి. సోమవారం హెడ్ మాస్టర్ సెలవులో ఉండటంతో ఆమె ఇన్‌చార్జి హెడ్ మాస్టర్‌గా ఉన్నారు.

**రాజకీయ కక్షతోనేనని విమర్శలు**

కేసీఆర్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక, ఆయనపై ద్వేషంతో అధికార పార్టీ నాయకులు మొదట బీఆర్ఎస్ నాయకులపై కేసు పెట్టాలని సదరు టీచర్‌పై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. మొక్కలు నాటడంలో తప్పేముందని భావించిన టీచర్ అందుకు నిరాకరించడంతో ఆమెపైనే సస్పెన్షన్ వేటు వేయాలని ఓ ముఖ్యనేత ద్వారా పట్టుబట్టినట్టు సమాచారం. కాగా పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి కనుసన్నల్లోనే ఈ తతంగం నడిచిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేసి, టీచర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ముఖ్యమంత్రి తీరు సిగ్గుచేటు!

- వార్డు మెంబర్ కాని రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి కలెక్టర్ సలాం కొట్టొచ్చు
- ఎండలో విద్యార్థులతో స్వాగతం చెప్పాచ్చు
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజున విద్యార్థులకు మిఠాయిలు పంచితే తప్పా?
- సీఎంగా ఉండి ఇంత అభద్రతా భావమా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులపై అడ్డగోలు వ్యాఖ్యలు, కక్షసాధింపు చర్యల తీరు సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 'వార్డు మెంబర్ కూడా కాని రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి కలెక్టర్ సలాం కొట్టొచ్చు.. పోలీసులు ఎస్కార్ట్ ఇవ్వొచ్చు..తిరుపతిరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంచొచ్చు.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయొచ్చు.. పాఠశాల విద్యార్థులను ఎర్రటి ఎండలో నిలబెట్టి వారితో పూలుచల్లించి స్వాగతం పలకొచ్చు.. వారితో అధికార యంత్రాంగం దగ్గరుండి సెల్యూట్ కొట్టించవచ్చు. ఏ అర్హత లేకున్నా అధికారిక వేదికపై కలెక్టర్‌ను వెనక్కు నెట్టి వేదికను పంచుకోవచ్చు. పొంగులేటి పుట్టినరోజున విద్యార్థులను ఎండలో నిలబెట్టి శుభాకాంక్షలు తెలియజేయవచ్చు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణికి ఎస్కార్ట్ సదుపాయం కల్పించవచ్చు. కానీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, 14 ఏండ్లు అహింసాయుత పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, అస్థిత్వాన్ని చాటిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజున విద్యార్థులకు మిఠాయిలు పంచితే తప్పా? కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు చేస్తే సరూర్‌నగర్ పాఠశాల హెడ్ మాస్టర్‌ను సస్పెండ్ చేస్తారా? కేసీఆర్ పుట్టిన రోజున హైదరాబాద్‌లో ఫ్లెక్సీలు కడితే చింపివేస్తరా?' అని మంగళవారం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు.'సీఎం రేవంత్‌రెడ్డికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులంటే గౌరవం లేదు. సహచర మంత్రుల మీద నమ్మకం లేదు. అత్యున్నత పదవిలో ఉండి ఇంత అభద్రతా భావమా? సిగ్గు సిగ్గు' అని ఫైరయ్యారు.

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేనిపై కేసు నమోదు**

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి18: మాజీఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌పై ఇంతేజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో అనుమతులు లేకుండా వేడుకలు నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించారంటూ కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్వహించిన వేడుకలకు బందోబస్తు నిర్వహించిన పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయడం ఏంటని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

## ఎర్రబెల్లి హెల్మెట్ల పంపిణీపై కాంగ్రెస్ ఫిర్యాదు

దేవరుప్పుల, ఫిబ్రవరి 18 : ఎమ్మెల్సీ కోడ్ ఉల్లంఘించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం యువతకు హెల్మెట్లు పంపిణీ చేశారంటూ జనగామ జిల్లా దేవరుప్పుల కాంగ్రెస్ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్యకర్తలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. దీనిపై కాంగ్రెస్ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

## మొక్కలు నాటేందుకు అనుమతిస్తే నేరమా?

### కాంగ్రెస్ సర్కారుపై దేవీప్రసాద్ ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ బర్త్‌డే సందర్భంగా మొక్కలు నాటేందుకు, విద్యార్థులకు చాక్లెట్లు పంచేందుకు అనుమతించారనే కారణంతో హస్తినాపురం డివిజన్ పరిధి జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎంను సస్పెండ్ చేయటం అమానుషమని బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మండిపడ్డారు. రాష్ట్రానికి, దేశానికి సేవలందించిన మహోన్నత వ్యక్తుల పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని, స్కూల్ సిలబస్‌లో ఉన్న మహనీయుల జన్మదిన వేడుకలను ప్రభుత్వం నిషేధించిందా? అని మంగళవారం ఓ ప్రకటనలో నిలదీశారు. ఎలాంటి ప్రొటోకాల్ లేని సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి కలెక్టర్ రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారని, కేసీఆర్ పుట్టిన రోజు చేసుకోవడం నేరమా? అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలపై కాకుండా ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. వెంటనే ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## 16 ఏండ్లలోపు పిల్లలు రాకపోతే నష్టం

- మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఇంప్లీడ్ పిటిషన్‌లు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రాత్రి 11 గంటల నుంచి ఉదయం 11 గంటల మధ్య 16 ఏండ్లలోపు వయసు పిల్లలను సినిమాలకు అనుమతించరాదన్న సింగిల్‌జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలంటూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుచేసింది. గేమ్‌చేంజర్ సినిమా సందర్భంగా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. మల్టీప్లెక్స్ అసోసియేషన్ తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదిస్తూ, ఈ ఉత్తర్వుల వల్ల మల్టీప్లెక్స్ థియేటర్లు నష్టపోతున్నాయని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు.. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

# మోసగాళ్లతో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు

- అక్రమంగా అసైన్డ్ భూముల విక్రయాలు
- అసైన్డ్ భూములను రిజిస్టర్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు లేదు
- అసైన్డ్ భూముల కేసులో హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): అమాయకులను మోసం చేయడమే లక్ష్యంగా కొంతమంది మోసగాళ్లు, రెవెన్యూ అధికారులు, సబ్‌రిజిస్ట్రార్లతో కుమ్మక్కవుతున్నారని హైకోర్టు ఘాటు వ్యాఖ్య చేసింది. అసైన్డ్ భూములను భూమార్పిడి చేసి విక్రయిస్తున్నారని అభిప్రాయపడింది. అసైన్డ్ భూములని తెలియక అమాయకులు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. 1977 అసైన్డ్ చట్ట నిబంధనల ప్రకారం ఏదైనా కారణంగా అసైన్డ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే నిజాయితీగా కొనుగోలు చేసిన వారికి నష్టం వాటిల్లుతున్నదని చెప్పింది. లేని భూములనూ విక్రయిస్తుంటారని ఆక్షేపించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో అసైన్డ్ భూమి/లావణి పట్టా భూమి విక్రయంపై మూడు నెలల్లో విచారణ జరిపి అవకతవకలకు పాల్పడినవారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. మొయినాబాద్‌లోని సర్వే నం. 178/23లో 0335 గుంటల లావణి పట్టా భూమిని తమ అంగీకారం లేకుండా మరొకరికి విక్రయించడంపై నాగమ్మ ఆమె ముగ్గురు కుమార్తెలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదిస్తూ, నాగమ్మ భర్త లక్ష్మయ్య తదతనంతరం అతనికి చెందిన అసైన్డ్ భూమిని నలుగురు కుమారులు మరో వ్యక్తికి 2021లో విక్రయించారని చెప్పారు. విక్రయించే ముందు నాగమ్మ, ఆమె కుమార్తెల అంగీకారం తీసుకోలేదని చెప్పారు. అసైన్డ్ భూమి/లావణి పట్టా అన్న విషయాన్ని తొక్కిపెట్టి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేసి విక్రయించారని తెలిపారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు.. తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ యాక్ట్ 1317 ఫసలీ ప్రకారం అసైన్డ్ భూమిని వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని తేల్చి చెప్పింది. ఆ షరతులను ఉల్లంఘించితే అసైన్డ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చునని పేర్కొంది. చట్ట నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములను రిజిస్టర్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు లేనేలేదని తేల్చిచెప్పింది. అసైన్డ్ చట్టంలోని సెక్షన్ 7 (2ఏ) ప్రకారం ఏ అధికారి అయినా 5(1),(2) కింద నిబంధనలను ఉల్లంఘిస్తే ఆరు నెలల సాధారణ జైలు రూ.10 వేలు జరిమానా విధించేందుకు చట్టంలో వీలుందని గుర్తుచేసింది. ప్రస్తుత కేసులో పిటిషనర్లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాలని, వినతి పత్రం అందిన మూడు నెలల్లోగా కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టాలని తీర్పుచెప్పింది.

## చార్జిషీటు అనుకూలంగా

# రాయడానికి లంచం

- రూ.20 వేలు వసూలు
- ఏసీబీకి చిక్కిన మక్తల్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు

మక్తల్, ఫిబ్రవరి 18 : లైంగిక దాడి కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి అనుకూలంగా చార్జిషీటు రాస్తామని చెప్పి రూ.20 వేలు లంచం తీసుకుంటూ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన మంగళవారం మక్తల్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకున్నది. ఏసీబీ మహబూబ్‌నగర్ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శ్రీనిధి ఫైనాన్స్ నడుపుతున్న వ్యక్తి, మక్తల్‌లో ఒక బ్రాంచ్ ప్రారంభించిన నేపథ్యంలో మహబూబ్‌నగర్‌కు చెందిన సంధ్యావెంకట్రాములుపై లైంగిక దాడి కేసు నమోదైంది. అతనికి హైకోర్టులో కండీషన్ బెయిల్ వచ్చింది. తరచూ మక్తల్ స్టేషకు హాజరవుతున్న క్రమంలో చార్జిషీటు అనుకూలంగా రాయడానికి సీఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు నర్సింహులు, సింగసాని శివతో కలిసి సంధ్యావెంకట్రాములును రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మక్తల్ పోలీస్ స్టేషన్‌లో సంధ్యావెంకట్రాములు నుంచి కానిస్టేబుల్ నర్సింహులు, శివ రూ.20 వేలు తీసుకొని జేబులో పెట్టుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం తీసుకున్న విషయం రుజువు కావడంతో సీఐతోపాటు కానిస్టేబుళ్లు నర్సింహులు, శివను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ రేంజర్, బీట్ ఆఫీసర్

### భద్రాద్రి జిల్లా కొమరారంలో ఘటన

ఇల్లెందు, ఫిబ్రవరి 18 : రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసిన అటవీ శాఖ రేంజర్, బీట్ ఆఫీసర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. ఇల్లెందు మండలం కొమరారం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బోయినతండాలో రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్ అటవీ శాఖ రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ నూనావత్ హరిలాల్‌ను సంప్రదించగా.. రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. మంగళవారం కొమరారం రేంజర్ కార్యాలయంలో సదరు కాంట్రాక్టర్.. రేంజర్, బీట్ ఆఫీసర్‌కు రూ.30 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

# రెక్కలిరిగిన రియల్టీ

మొదటిపేజీ తరువాయి...

ఏడాదిలో రెసిడెన్షియల్ ఇండ్ల అమ్మకాలు 22 శాతం క్షీణించాయి. హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్ తీరుతెన్నులను విశ్లేషిస్తూ క్రెడాయ్ హైదరాబాద్, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంస్థ సంయుక్తాధ్వర్యంలో 'హైదరాబాద్ హౌజింగ్ రిపోర్ట్' పేరిట మంగళవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2023 నుంచి 2024 వరకు మొత్తం 8 త్రైమాసికాల్లో ఇండ్ల అమ్మకాల ట్రెండ్ ఆధారంగా నివేదిక రూపొందింది. హైదరాబాద్ కేంద్రంగా రిజిస్ట్రేషన్, రేరా అనుమతులతో కూడిన వాస్తవిక గణాంకాలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదికను తయారు చేశారు. నగరం నలువైపులా ఉన్న మార్కెట్ స్థితిగతులు, క్రయవిక్రయాలు, ధరలు వంటి అంశాలతో ఈ నివేదికను ఆవిష్కరించారు. హైదరాబాద్ నగరాన్ని నాలుగు భాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాల్లో జరిగిన రిజిస్ట్రేషన్లు, పొందిన రెరా అనుమతులను ప్రామాణికంగా తీసుకున్నారు. నార్సింగి నుంచి మణికొండ, శేరిలింగంపల్లి నుంచి గండిమైసమ్మ వరకు విస్తరించిన ప్రాంతాన్ని నార్త్ వెస్ట్‌గా, గండిమైసమ్మ నుంచి బోడుప్పల్ వరకు నార్త్ ఈస్ట్‌గా, ఉప్పల్ నుంచి బాలాపూర్ వరకు సౌత్ ఈస్ట్‌గా, బాలాపూర్ నుంచి నార్సింగి వరకు సౌత్ వెస్ట్ నగరంగా విభజించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న క్రయవిక్రయాలు, కొత్త ప్రాజెక్టుల లాంచింగులు, అమ్ముడుపోని యూనిట్ల సంఖ్య, ధరల తీరు వంటి అంశాలతో సమగ్రమైన నివేదికను క్రెడాయ్-హైదరాబాద్, సీఆర్ఈ మ్యాట్రిక్స్ సంస్థలు రూపొందించాయి.

**ఊసే లేని కొత్త ప్రాజెక్టులు**

ఐటీకి కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో ఏటా లక్ష నుంచి లక్షన్నర యూనిట్లు మార్కెట్లోకి వస్తుండేవి. కానీ, ఏడాదిగా కొత్త ప్రాజెక్టుల లాంచింగ్‌లు కనిపించడం లేదు. 2023-2024 మధ్యకాలంలో ఆవిష్కరించిన కొత్త ప్రాజెక్టుల గణాంకాలే అందుకు నిదర్శనం. అస్పష్టమైన, ఆందోళనకరమైన పరిస్థితుల్లో కొత్త ప్రాజెక్టులకు అనుమతులు తీసుకోవడం కంటే... నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం లేదా, పేరుకుపోయిన ఇన్వెంటరీని తగ్గించుకోవడంపైనే వ్యాపారులు దృష్టి పెట్టారు. దీంతో 2023 చివరి త్రైమాసికంలో 22వేల యూనిట్లుగా ఉన్న ఇన్వెంటరీ పరిమాణం... 2024 చివరి త్రైమాసికం నాటికి ఏకంగా 11 వేలకు తగ్గింది. ఇక 2023లో కొత్త ప్రాజెక్టుల ద్వారా 95,911 యూనిట్లు మార్కెట్లోకి వస్తే.. 2024 నాటికి లాంచ్ అయిన యూనిట్ల సంఖ్య 48,534కు పరిమితమైంది.

**ఐటీ కారిడార్‌లోనే 60 శాతం**

2023 నుంచి 2024 వరకు చూసుకుంటే అమ్మకాలు, కొత్త ప్రాజెక్టులన్నీ ఐటీ కారిడార్ కేంద్రంగానే సాగాయి. ఈ రెండేళ్లలో సగటున హైదరాబాద్ రియల్టీ డిమాండ్ 60 శాతానికి పైగా ఈ ప్రాంతంలోనే విస్తరించి ఉంది. ఆ తర్వాతి స్థానంలో సౌత్ వెస్ట్ ప్రాంతమైన బాలాపూర్ నుంచి నార్సింగి వరకు రియల్ వ్యాపారులు, కొనుగోలుదారులు మొగ్గుచూపారు. ఈ ప్రాంతాల మధ్య 30 శాతానికి పైగా విస్తరించి ఉండగా.. సీఎం రేవంత్ కలలు కంటున్న ఫోర్త్ సిటీ విస్తరించి ఉన్న నార్త్ ఈస్ట్, సౌత్ ఈస్ట్ ప్రాంతాల్లో డిమాండ్ లేకపోవడం గమనార్హం. గడ్డిమైసమ్మ నుంచి బాలాపూర్ వరకు విస్తరించి ఉన్న రెండు కారిడార్లు కలిపితే సగటున 5-8 శాతంలోపే డిమాండ్ ఉంది. ఫోర్త్ సిటీ పేరిట లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువస్తున్నామని సర్కారు గప్పాలు కొడుతున్నా.. క్షేత్రస్థాయిలో ఏ మాత్రం ప్రభావం చూపలేదని స్పష్టమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ విధివిధానాలతోపాటు, రియల్ ఎస్టేట్ రంగాన్ని భయాందోళనలకు గురిచేసే కార్యకలాపాలే కారణమని స్పష్టమవుతున్నది.

**కాంగ్రెస్ విధానాల వల్లే**

దేశంలోని అన్ని మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం గతంలో పరుగులు పెట్టేది. కానీ, కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో ఇప్పుడు పడకేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులను రద్దు చేయడం.. చెరువుల సంరక్షణ, మూసీ ప్రక్షాళన పేరిట సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేసిన విధానాలు భయాందోళనలకు కారణమై మార్కెట్‌ను కుప్పకూల్చాయి. ఇక రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన అంశాలపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోవడం కూడా కారణమనే అభిప్రాయమూ వ్యక్తమవుతున్నది. ఇప్పటికైనా రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేలా, అమ్మకాలను ప్రభావితం చేసేలా, కొనుగోలుదారులకు భరోసా కల్పించేలా ప్రభుత్వం విధానాలను ప్రకటిస్తే తప్ప మార్కెట్ కోలుకునే పరిస్థితి లేదని పలువురు చెబుతున్నారు. బిల్డర్లను ప్రోత్సహించేలా భవన నిర్మాణ అనుమతుల ఫీజులను వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించడం, మహారాష్ట్ర ప్రభుత్వం తరహాలో రిజిస్ట్రేషన్ చార్జీల్లో రాయితీలను ప్రకటించడం, తదితర చర్యల ద్వారా మార్కెట్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని రియల్టర్లు పేర్కొంటున్నారు. ఈ మేరకు గతంలో సీఎం ఇచ్చిన హామీ ప్రతిపాదనలకే పరిమితమైంది. మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టకుండా, రాజకీయాల